సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 16 । జూలై । 2024



భూసార పరీక్ష - చేనుకు రక్ష

భూసార పరీక్షలను నిర్వహించుకుని తగిన పంటలను ఎంపిక చేసుకున్నప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. - 8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్ధవటం రేంజ్‌లోని లంకమల అడవుల్లో 18 ఎర్ర చందనం దుంగలను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్ గాలింపు చేపడుతోంది. - 8లో


మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.600	రూ.800
రెండోరకం	రూ.420	రూ.580

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 712 మెట్రిక్ టన్నులు







తమ్ముళ్లూ.. మీ కలలు సాకారం చేస్తా.. ఇంటికో ఉద్యోగం ఇస్తా.. లేదంటే నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తా.. అంటూ ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి నెలదాటినా దీనిపై నోరు మెదపడంలేదు. 2014లోనూ రూ.2వేలు భృతి ఇస్తానంటూ ఇలాగే మాట తప్పారు.

భృతి.. భ్రాంతి!

- ఇంటికో ఉద్యోగం..లేదంటే రూ.3వేల భృతి ఇస్తానని చంద్రబాబు హామీ..
- నేటికీ ఆ ప్రస్తావనే లేదు
- నైరాశ్యంలో నిరుద్యోగులు
- జిల్లాలో 4,84,598 మంది యువకులు



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోపే తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నారు. తల్లికి వందనం పేరుతో తల్లులను వంచించేందుకు సిద్ధమైన చంద్రబాబు.. నిరుద్యోగ భృతి పేరుతో చదువుకున్న యువతను మరోసారి నిట్టనిలువునా మోసగించేందుకు ఏమాత్రం వెనుకాడటం లేదు. తాను అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3వేలు భృతి కల్పిస్తానని యువతలో ఆశలు రేకెత్తించారు. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు దాటినా ఇంతవరకు నిరుద్యోగ భృతిపై నోరు మెదపడం లేదు. భృతి ఎప్పుడిస్తారు బాబూ అంటూ యువత ప్రశ్నిస్తున్నారు.

సాక్షి రాయచోటి : చదువుకున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ఉపాధి అవకాశాలు మృగ్యంగా మారుతున్నాయి. చదువుకున్నా ఉద్యోగాలు రాక యువత అల్లాడిపోతోంది. ఇలాంటి తరుణంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రస్తుత సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకంలో భాగంగా లక్షలాది ఉద్యోగాలు....లేదంటే రూ.3వేలు నిరుద్యోగ భృతి అంటూ ఊదరగొట్టారు. తీరా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల సంగతి పక్కనపెడితే నిరుద్యోగ భృతి కోసం నిరీక్షణ ప్రారంభమైంది. కనీసం ఉద్యోగం లేకపోయినా బాబు అందించే భృతితో అయినా కొంతమేర అవసరాలు తీర్చుకోవచ్చనే నిరుద్యోగుల ఆశలపై నీలి నీడలు అలుముకుంటున్నాయి. అయితే 2014కు ముందు ఇంటింటికి ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి అంటూ ఊరూరా ఊదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆంక్షలతో ఎగ్గొడుతూ.. మళ్లీ 2019 ఎన్నికల ముందు కొంతమందికి తూతూ మంత్రంగా అందించిన వ్యవహారం నేపథ్యంలో ఇప్పుడు ఎలాంటి ఆంక్షలతో మొదలవుతుందోనన్న ఆందోళన వెంటాడుతోంది. ఇదిలా ఉండగా ముందుగానే కరువు ప్రాంతంగా గుర్తింపు పొందిన అన్నమయ్య జిల్లాలో ఉపాధి కోసం అధికంగా వలసలు పోతూనే ఉన్నారు. ఇలాంటి తరుణంలో కూడా భృతిపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

యువతకు సంబంధించిన వివరాలు

జిల్లాలో 18-35 సంవత్సరాల మధ్యగల యువత	4,84,598
ఇందులో పురుషులు	2,46,982
మహిళల సంఖ్య	2,37,546
థర్డ్ జెండర్	70



పెరుగుతున్న నిరుద్యోగ యువత

జిల్లాలో రోజురోజుకు నిరుద్యోగ యువత పెరిగిపోతోంది. ప్రధానంగా టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పాలిటెక్నిక్, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులు, బీఈడీ, డీఎడ్ ఇలా చెబుతూపోతే అనేక రకాల చదువులు చదివి ఉద్యోగాలు రాక చాలామంది ఇంటిపట్టున గడుపుతున్నారు. కొంతమంది డిగ్రీ, ఎంఏలు చేసినా ప్రభుత్వ ఉద్యోగం కనిపించక.. ప్రైవేటు ఉపాధి లభించక అవస్థలు పడుతున్నారు. జిల్లాలో సుమారు 4,84,598 మంది యువకులు ఉన్నారు. అందులో చాలా వరకు చదువుకున్న వారే ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా నిరుద్యోగుల్లో నైపుణ్యం పెంచే ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం పెరుగుతున్న నిరుద్యోగులకు సంబంధించి వెంటనే ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ప్రజా, యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉపాధి లేక విదేశాలకు వలసలు

అన్నమయ్య జిల్లాలో చదువుకున్న చాలామంది యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక విదేశాలకు వలసలు వెళుతోంది. జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వెళ్లగా, తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె ప్రాంతాల నుంచి కొంత మేర కలుపుకుని సుమారు 30 వేల మంది పైచిలుకు విదేశాలకు వలస బాట పట్టారు. 1980 నుంచి ప్రారంభమైన వలసల పర్వం ఈనాటికీ నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇక్కడ ఉపాధి లభిస్తే వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉండదు.

ఎదురుచూపులు

జిల్లాలో చదువుకున్న నిరుద్యోగ యువత భృతి కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోంది. ఈ అంశాన్ని కూటమి సర్కార్ సూపర్ సిక్స్‌లోనే పొందుపర్చడంతో అధికారంలోకి వచ్చిన తరుణంలో నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తోంది. ఉద్యోగాలు లేని వారంతా భృతి ఎప్పుడిస్తారని స్థానిక అధికారులను కూడా ప్రశ్నిస్తున్నారు. సర్కార్ కొలువుదీరి నెల రోజులు దాటిపోవడం...ఇంతవరకు దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో అన్ని వర్గాల నిరుద్యోగులు ఎప్పుడిస్తారని ప్రభుత్వాన్ని అడుగుతున్నారు.

కాలయాపన తగదు



బైరెడ్డి అనిల్ కుమార్‌రెడ్డి, రాఘవరాజపురం, రైల్వేకోడూరు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని నిరుద్యోగులకు ప్రతి నెలా అందిస్తామన్న నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు వెంటనే చెల్లించాలి. కాలయాపన చేయకుండా ప్రతి నెలా ఇవ్వడం వల్ల మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇచ్చిన హామీని మరువకుండా మాటకు కట్టుబడి ఉండాలి.

స్పష్టత ఇవ్వాలి



- షేక్. మస్తాన్, నిరుద్యోగి, సంబేపల్లె మండలం

నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరి కాకుండా వెంటనే భృతిని ప్రకటించాలి. నిరుద్యోగ భృతి హామీ ఇచ్చారు గాని అమలుపై నమ్మకం సన్నగిల్లే విధంగా చేస్తున్నారు. ఉద్యోగాలు కల్పించేంత వరకు ఆర్థిక సహాయంగా భృతి ఇస్తే నిరుద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుంది.

వెంటనే అమలు చేయకుంటే ఆందోళనలు చేస్తాం



చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే నిరుద్యోగ భృతి అమలు చేయాలి. లేకుంటే నిరుద్యోగుల పక్షాన నిలిచి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతిని ఇస్తామని చంద్రబాబునాయుడుతో పాటు ఆయన తనయుడు నారా లోకేష్ కూడా విద్యార్థులు, నిరుద్యోగులతో సమావేశాలు ఏర్పాటు చేసి చెప్పారు. మరి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు పూర్తయినా నిరుద్యోగ భృతి గురించి పట్టించుకోవడం లేదంటే నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసే కుట్రపన్నుతుందన్న అనుమానం కలుగుతుంది.

- చిట్వేలి రవికుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, రాజంపేట

హామీని అమలు చేయాలి



- మందపల్లి విజయవర్దన్, సిద్దవటం

నేను ఎంబీఏ చదువుకున్నాను. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం లేదంటే నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చి నెల కావస్తోంది. ఇప్పటి వరకు ఈ విషయంపై ఉలుకు పలుకు లేదు. ముఖ్యమంత్రి మాలాంటి నిరుద్యోగులకు ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి కచ్చితంగా ఇవ్వాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి



- రాపూరి నజింత్‌కుమార్, కొత్తపల్లె గ్రామ పంచాయతీ, చిన్నమండెం

మాలాంటి నిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రస్తుతం నిరుద్యోగ శాతం ఎక్కువగా పెరిగిపోయింది. ఎన్డీఏ కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగభృతి కానీ ఇంటికో ఉద్యోగం కానీ వెంటనే ఇవ్వాలి. అందుకు సంబంధించిన విధివిధానాలను వీలైనంత త్వరగా ప్రకటించాలి.

నిరుద్యోగభృతి ఏదీ?ఎప్పుడు!



చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడానికి ఏ అబద్ధమైనా ధైర్యంగా చెప్పగలరు. మేనిఫెస్టోలో ఉన్నవి అధికారంలోకి వచ్చిన తర్వాత కనిపించవు. గతంలో ఓమారు నిరుద్యోగ భృతి విషయంలో మాట తప్పారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల ముందు అదే హామీతో నిరుద్యోగులను బురిడీ కొట్టించారు. ఇప్పటి వరకు నిరుద్యోగ భృతి గురించి ఊసేలేదు. భృతి ఎప్పడిస్తారో చంద్రబాబు యువతకు సమాధానం చెప్పాలి.

- ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

ఇంతవరకు ప్రకటన లేకపోవడం దారుణం



చదువుకున్న యువతకు ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి కల్పిస్తానని చంద్రబాబు చెప్పిన మాటలు నమ్మి నేను కూటమికి మద్దతు పలికాను. ప్రభుత్వం ఏర్పడి నెలరోజులైనా నిరుద్యోగభృతిపై, ఇంటికో ఉద్యోగంపై సరైన ప్రకటన చేయకపోవడం దారుణం. చంద్రబాబు యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. మాలాంటి నిరుద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- కె.రెడ్డయ్యరాజు, రాయచోటి

భృతి అందుతుందా.. లేదా.!



2017లో డిగ్రీ పూర్తి చేసుకున్నాను. ప్రస్తుతం ఉపాధి హామీ పనికి వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందజేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బాబు అధికారంలోకి వచ్చి నెల గడిచినా ఇప్పటి వరకు దీనిపై స్పష్టమైన ప్రకటన లేదు. నిరుద్యోగ భృతి అందుతుందా లేదా..

- రాయదుర్గం లక్ష్మయ్య, బాలాజీ నగర్ కాలనీ, లక్కిరెడ్డిపల్లె

న్యూస్‌రీల్

రేపు రైల్వేకోడూరులో ఉద్యోగ మేళా

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 17వ తేదీ బుధవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక సాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. బహుళ జాతి సంస్థ అయిన 24/7ఏఐ సంస్థ ఉద్యోగావకాశాలు కల్పిస్తుందన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంగమ్మ దేవత హుండీ లెక్కింపు



గంగమ్మ దేవత హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లి : అనంతపురం గంగమ్మ దేవత హుండీ లెక్కించగా ఆదాయం రూ. 2,83,655 వచ్చినట్లు ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, ప్రత్యేక అధికారి మారుతీ ప్రసాద్ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో సోమవారం ఆలయ కమిటీ, సిబ్బంది ఆధ్వర్యంలో హుండీని లెక్కించినట్లు వారు తెలిపారు. వచ్చిన హుండీ ఆదాయం మొత్తం ఆలయ ఖాతాకు జమ చేసి ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు వారు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో సిబ్బంది, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై సౌమ్యనాథుడు



హంస వాహనంపై ఊరేగుతున్న సౌమ్యనాథుడు

నందలూరు : జిల్లాలో ప్రముఖ వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడోరోజు సోమవారం ఉదయం పల్లకీసేవ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు సునీల్ సుమార్ శర్మ బృందం ఆధ్వర్యం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ కార్యక్రమం అనంతరం రాత్రి హంస వాహనంపై సరస్వతీ దేవి అలంకారంలో శ్రీ సౌమ్యనాథుడు శ్రీదేవి, భూదేవితో కలిసి విశేషాలంకరణలో మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాలలో నేడు...

ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజు మంగళవారం ఉదయం పల్లకీసేవ, గ్రామోత్సవం, తిరుమంజనం, రాత్రికి సింహ వాహనంపై సౌమ్యనాథ స్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు.

ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి



సమస్యలను వింటున్న జిల్లా అదనపు ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులకు చట్టపరిధిలో సత్వరం పరిష్కారం చూపాలని జిల్లా అదనపు ఎస్పీ వీబీ రాజ్ కమల్ అన్నారు. సోమవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుంచి అదనపు ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 58 మంది తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఫిర్యాదులను పరిశీలించిన అదనపు ఎస్పీ విచారించి త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు.

స్వయం ఉపాధితో రాణించాలి



టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్

రాయచోటి (జగదాంబసెంటర్) : స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ యూత్ స్కిల్‌డే సందర్భంగా స్కిల్ హబ్‌లో టైలరింగ్‌లో శిక్షణ పొందిన 60 మంది నిరుద్యోగ మహిళలకు శిక్షణా సర్టిఫికెట్స్, 25 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్కిల్ హబ్‌లను వినియోగించుకుని ఉన్నత ఉద్యోగాలు పొందాలని సూచించారు. మహిళలు వీటి ద్వారా ఉపాధి పొంది తమ కుటుంబానికి ఆసరాగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, జిల్లా జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, గుడ్‌నైబర్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళీ సమేత వీరభద్రుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటిలో భద్రకాళీ సమేత వీరభద్రుడికి అత్యంత భక్తి శ్రద్ధలతో పల్లకీ సేవ చేశారు. సోమవారం రాత్రి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్య స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి, శేఖర్ స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌లకు అభిషేకాలు, పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.

సిద్దవరం చిన్నోడికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పంపిన మెడల్స్‌తో బాలుడు

పెనగలూరు : మండలంలోని ఎగువసిద్దవరం గ్రామానికి చెందిన సూరే కుశాంకు కుమార్ రెడ్డి(2)కి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించిందని బాలుడి తల్లిదండ్రులు సూరే శివకుమార్ రెడ్డి, సూరే సౌమ్య తెలిపారు. ఆంగ్ల నెలలు, వారాలు, ఏబీసీడీలు, రైమ్స్, శరీర భాగాలు, జంతువుల పేర్లు, అంకెలు, సంఖ్యలు, పుష్పాలను గుర్తించడం, శ్రీరామ రామ రామేతి శ్లోకం చెప్పడం వంటి పరీక్షలు నిర్వహించారన్నారు. బాలుడి జ్ఞాపక శక్తిని వీడియో తీసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌కు పంపించగా ఈమేరకు స్థానం కల్పించినటు సమాచారం అందించారన్నారు.

కుష్టు రహిత జిల్లాగా మార్చాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



కుష్టువ్యాధి ప్రచార పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్, వైద్యశాఖ అధికారులు

రాయచోటి : అన్నమయ్య జిల్లాను కుష్టువ్యాధి రహితంగా మార్చాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమవేశ హాలులో జేసీ అధ్యక్షతన కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలో జూలై 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రం సిబ్బంది పటిష్టంగా నిర్వహించాలని జేసీ సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా మొత్తం 1237 టీమ్‌లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే పరిశీలించేందుకు 502 మంది సూపర్ వైజర్లను నియమించారన్నారు. అనంతరం కుష్టువ్యాధి ప్రచార పోస్టర్లను, కరపత్రాలను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణరావు, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శైలజ, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్దన్ రెడ్డి, పారామెడికల్ అధికారి రవికుమార్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు శంభు ప్రసాద్, వేణుగోపాల్, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దళితుడిపై దాడి కేసులో డీఎస్పీ విచారణ



విచారణ చేపడుతున్న స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్

ఒంటిమిట్ట : మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో శనివారం దళితుడిపై దాడి జరిగిన కేసులో సోమవారం కడపస్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్ విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం పెన్నపేరూరు గ్రామానికి చేరుకొని అక్కడి సాక్షులను విచారించి రిపోర్టు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

మదనపల్లె : వ్యభిచార గృహంపై దాడులు చేసి ముగ్గురిపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. చంద్రాకాలనీకి చెందిన సావిత్రి(42), వేంపల్లెకు చెందిన హరిబాబు(40) ఈస్ట్‌పేటలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారు. వాట్సాప్ ద్వారా మహిళల ఫోటోలు పంపి విటులను ఆకర్షించేవారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులు, ఓ విటుడు, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళలకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లెకు చెందిన రెడ్డెప్ప భార్య పి.రెడ్డిలక్ష్మి(38) కుటుంబ సమస్యలతో ఆదివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. అదే విధంగా మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన ఓ మైనర్ బాలిక(16)ను తల్లిదండ్రులు మందలించడంతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అలాగే తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డకు చెందిన నడిపన్న కుమారుడు గంగాధర(23) కుటుంబ సమస్యలతో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

108లో మహిళ ప్రసవం

చిట్వేలి: చిట్వేలి మండలం పెద్దూరు ఎస్టీ కాలనీకి చెందిన మహిళ శివనాగులుకు సోమవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. 108 వాహనం ఈఎంటీ వీరాంజనేయులు, పైలెట్ కాకి శ్రీనులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో నైపుణ్యంతో ప్రసవం చేసి తల్లీ,బిడ్డను కాపాడారు. శివనాగులు పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులను ఇంటికి చేర్చారు. నైపుణ్యం ప్రదర్శించిన 108 సిబ్బందిని పలువురు అభినందించారు.

సీఏ విద్యార్థి దుర్మరణం

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సీఏ విద్యార్థి మృతి చెందినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. చౌడేపల్లె ఎమ్మెల్యే వీధికి చెందిన సుధాకర్, సులోచన దంపతుల కుమారుడు ఆదర్శ్ సాయి(21) తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీఏ చదువుతున్నాడు. ఆదివారం రాత్రి మదనపల్లెలో స్నేహితులను కలిసేందుకు ద్విచక్ర వాహనంలో వచ్చాడు. తిరిగి మరో యువకుడు గుర్రప్పతో కలిసి మదనపల్లె బైపాస్ రోడ్డులో వెళ్తున్నారు. సాయిబాబా ఆలయం సమీపంలో ఎదురుగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆదర్శ్ సాయి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ కావడంతో మదనపల్లెకు తీసుకువస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. తండ్రి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

భూసార పరీక్ష - చేనుకు రక్ష

రైతు తన పొలంలో అధిక దిగుబడి పొందాలన్నా.. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా.. మట్టి స్వభావం తెలుసు కోవాలన్నా.. భూమిలో ఎలాంటి పంటలు పండించుకోవాలన్నా ముందుగా భూసార పరీక్షలు చేయించాలి. మట్టి పరీక్ష చేయించి తగు సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు : భూసార పరీక్షలను నిర్వహించుకుని

36 మండలాల్లో మట్టి నమూనాల సేకరణ

తగిన పంటలను ఎంపిక చేసుకున్నపుడే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ జిల్లాలో భూసార పరీక్షల నిర్వహణకు మట్టి నమూనా సేకరణ ప్రారంభించింది. 2024- 25 సంవత్సరానికి జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో మొత్తం 17800 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. పోషక విలువలతోబాటు భూమిలోని చౌడు గుణం, సున్నం శాతం, నేల కాలుష్యం స్థాయి తెలుసుకోవడానికి భూసార పరీక్ష ఉపయోగపడుతుంది. భూమి స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా తగిన పంటలను సాగు చేసి అద్భుత ఫలితాలు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇవి పాటించడంతో రైతులు పంటల సాగులో ఖర్చు తగ్గించుకుని నికర ఆదాయాన్ని పెంపొందిచుకునే అవకాశాలున్నాయి.

ఎరువుల వాడకంలో మెలకువలు

కనీసం రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి భూసార పరీక్షలను చేయించుకుని తమ పొలాల్లో వివిధ పోషక పదార్థాల విలువలు తెలుసుకోవాలి. ఫలితాల ఆధారంగా తగిన మోతాదులోనే ఎరువులు వాడి అవసరమైన పోషకాలు అందించడం చాలా ముఖ్యం. తద్వారా అనవసర ఖర్చు తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది. భూమిలో పోషకాలు సమర్థంగా వినియోగించుకని దిగుబడులు సాధించవచ్చు.

మట్టి పరీక్షలు చేయించుకోవాలిలా..

- భూసార పరీక్ష నిర్వహించడంలో సరైన పద్ధతి పాటించినపుడే సత్ఫలితాలు వస్తాయి.
- పొలంలో ఆంగ్ల వి అక్షరం ఆకారంలో 15సెం.మీ వరకు పారతో గుంత తీసి అందులో పైపార నుంచి కింది పొర వరకు మట్టిని సేకరించాలి.
- ఎకరా విస్తీర్ణంలో ఎనిమిది నుంచి పది చోట్ల సేకరించిన మట్టిని ఒక చోట చేర్చి బాగా కలిపి నాలుగు భాగాలుగా చేయాలి. ఎదురెదురుగా వున్న భాగాలను అర కిలో వచ్చే వరకు తీసుకుని మిగిలినవి తీసి వేయాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, వేర్లు లేకుండా చేసి నీడలో ఆరబెట్టాలి. మట్టి నమూనా సేకరణకు రసాయన, సేంద్రియ ఎరువు సంచులు వాడరాదు.
- గట్ల వద్ద, పంట కాల్వలు, చెట్ల కింద, ఎరువును కుప్పగా వేసినచోట.. ఎప్పుడూ నీరు నిల్వ వుండే ప్రదేశంలోనూ మట్టి నమూనాలు సేకరించరాదు.
- పొలంలో చౌడు ప్రాంతం ఉన్నట్లయితే ప్రత్యేకంగా మట్టి నమూనా తీసి పంపాలి. పంట రకాన్ని బట్టి మూడు నుంచి ఆరు అడుగుల లోతు వరకు గుంత తీసి ప్రతి అడుగుకు మట్టి సేకరించి పంపాలి. వుంటుంది.

కార్డులలో నమోదు

వ్యవసాయ డివిజన్ వారీగా మట్టి నమూనాల సేకరణ లక్ష్యాలివీ..		
వ్యవసాయ డివిజన్	మండలాల సంఖ్య	నమూనాల సంఖ్య
కడప	6	2580
కమలాపురం	4	2180
పులివెందుల	5	2760
ముద్దనూరు	4	2360
ప్రొద్దుటూరు	4	1990
మైదుకూరు	4	2360
బద్వేలు	4	1390
పోరుమామిళ్ల	5	2180

రైతులు సేకరించిన మట్టి నమూనాలను అందుబాటులో ఉన్న భూసార పరీక్షా కేంద్రాలకు పంపాలి. వారు పరీక్షలు నిర్వహించి వివిధ పోషక విలువల శాతాన్ని కార్డులలో పొందుపరచి రైతుకు అందజేస్తారు.

ప్రధాన పోషకాలేవి?

ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రియ కర్బణంతోపాటు ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం, సూక్ష్మ ధాతు పోషకాలైన గంధకం, జింక్, బోరాన్, ఇనుము, మాంగనీస్, రాగి వంటి వాటి విలువల శాతాన్ని నమోదు చేసి అవి వుండాల్సిన శాతం భూసార పరీక్షల ద్వారా తెలుస్తుంది. పంటలకు వాడాల్సిన ఎరువుల మోతాదు, వాడే విధానం సూచిస్తారు.

భూసార పరీక్షతో ప్రయోజనాలు



భూసార పరీక్ష చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయడంతో మంచి ఫలితం ఉంటుంది. భూమిలో పోషకాల విలువలను తెలుసుకుని అవసరమైన ఎరువులు వాడవచ్చు. దీంతో అనవసర ఖర్చు తగ్గించుకోవడానికి అవకాశం వుంది.

- ఏవీ.నరసింహారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, కమలాపురం

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. పట్టణంలోని నర్సింగ్ హోం వీధికి చెందిన మహమ్మద్ కుమార్తె మహర్ సుల్తానా(22)ను ముదివేడుకు చెందిన గౌస్ సాహెబ్ కుమారుడికి ఇచ్చి నాలుగేళ్ల కిందట వివాహం జరిపించారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వివాహ సమయంలో కట్న కానుకలు, నగదు ఇచ్చినా.. ఇటీవల అదనపు కట్నం కోసం వేధింపులు మొదలయ్యాయి. దీంతో మహర్ సుల్తానా పుట్టింటికి చేరుకుని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. వారి సూచన మేరకు ఆ సమయంలో రూ.8 లక్షల నగదు, 75 గ్రాముల బంగారు సయ్యద్ లతీఫ్ కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కొంతకాలం సవ్యంగా సాగిన వీరి కాపురంలో తిరిగి అదనపు కట్నం వేధింపులు మొదలయ్యాయి. దీంతో భరించలేని మహర్ సుల్తానా పుట్టింటికి చేరుకుని అత్తింటి వేధింపులపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ మేరకు భర్త సయ్యద్ లతీఫ్, మామ గౌస్‌సాహెబ్, అత్తపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

రాయచోటి టౌన్ : కబ్జాదారుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని బీసీ సంఘం అన్నమయ్య జిల్లా కార్యదర్శి ఇడగొట్ట నాగేశ్వరావు గ్రీవెన్స్ సెల్‌లో జిల్లా రెవెన్యూ అధికారులకు సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటిలో మదనపల్లె రోడ్డు- చిత్తూరు రింగ్ రోడ్డు మధ్య రవ్వల గుట్ట సమీపంలో 592/2లో 1997లో నాలుగో తరగతి ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇచ్చారని చెప్పారు. ఆ ఇంటి స్థలంలో కొంత మంది ఇళ్లు కట్టుకున్నారని, మరింతమంది ఆర్థిక స్థోమత లేక, ఇంకొంతమంది ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో నిర్మాణాలు చేపట్టలేదని తెలిపారు. దీనిని అదునుగా తీసుకుని కొందరు నాయకులు ఆ స్థలాలు ఆక్రమించారని ఆరోపించారు. ఆర్డీవో స్థాయి అధికారులు విచారణ సాగించి న్యాయం చేయాలని కోరారు. నరహరి, బ్రహ్మయ్య, రామసుబ్బయ్య,రామ లక్ష్మమ్మ, షేక్ బాసాజన్ పాల్గొన్నారు.

వేతనాల కోసం ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : జిల్లాలో గత 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తొలుత పట్టణశివారులోని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్ధయ్య, మధుకర్ మాట్లాడుతూ గౌరవ వేతనాలు చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు గడవడం గగనమైపోతోందన్నారు. పలుమార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడంతో ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు వారు తమకు నెలల తరబడి జీతాలివ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అనంతరం జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు రవీంద్ర, రామయ్య, వంశీ, ధనశేఖర్, ఖాదర్‌బీ, పద్మజ, నాగరాజు, రమణ, రామాంజులు, క్రిష్ణయ్య, వెంకట్రామిరెడ్డి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ట్యాలీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరు నగరంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయి 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. 35 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణలో ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇస్తారన్నారు.

శిక్షణానంతరం వివిధ సంస్థల్లో కనీస వేతనం రూ.15వేలతో ఉపాధి కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న దుంగలతో సిద్ధవటం రేంజ్ అటవీ అధికార సిబ్బంది

సిద్ధవటం : సిద్ధవటం రేంజ్‌లోని లంకమల అడవుల్లో 18 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని రేంజర్ కళావతి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్ధవటం ఫారెస్ట్ ఫోర్స్ స్పెషల్ టీమ్ లంకమల అభయారణ్యంలో రెండు రోజులుగా కూంబింగ్ నిర్వహిస్తోందన్నారు. సిద్ధవటం బీట్‌లోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు ఎర్రచందనం చెట్లను నరుకుతున్నట్లు ఉప్పు గుంతలు అటవీ ప్రదేశంలో శబ్దాలు వినిపించాయన్నారు. అక్కడికి వెళ్తుండగా వారు అటవీ సిబ్బందిని చూసి ఎర్రచందనం దుంగలు వదిలేసి పరారయ్యారన్నారు. పట్టుకోవడానికి యత్నించినా కనిపించకుండా తప్పించుకున్నారన్నారు. అనంతరం స్మగ్లర్ల కోసం స్పెషల్ టీమ్ అడవిలో గాలింపు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. అక్కడ లభ్యమైన 18 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొని అటవీ శాఖ కార్యాలయానికి తరలించామని రేంజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, సిద్ధవటం బీట్ ఇన్‌చార్జి ఎఫ్‌బీఓ పెంచలరెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంప్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన మద్యం మోజు

ఆర్టీసీ బస్సు కింద పడి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



సాయికుమార్ (ఫైల్)



మోహన (ఫైల్)



ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన విద్యార్థుల మృతదేహాలు

మదనపల్లె : నూతన వాహనం కొన్న ఆనందంలో.. పార్టీ పెట్టుకున్న విద్యార్థులు పూటుగా మద్యం తాగి వేగంగా రావడంతో ఆర్టీసీ బస్సు ఢీకొంది. మదనపల్లిలో జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం కలిచెర్ల పంచాయతీ బాటవారిపల్లెకు చెందిన ఎర్రగోల్ల చిన్నరెడ్డెప్ప, ఈశ్వరమ్మల రెండో కుమారుడు వై.సాయికుమార్ డిగ్రీ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎర్రగోల్ల వెంకటరమణ, శివమ్మల కుమారుడు మోహన్(18) కలిచెర్లలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇటీవల సాయికుమార్ యమహా-ఎఫ్‌జెడ్ బైక్ కొనుగోలు చేశాడు. దీంతో ఇద్దరూ కలిసి పార్టీ చేసుకుందామని మదనపల్లె మీదుగా కర్నాటక రాష్ట్రం రాయల్పాడుకు వెళ్లారు. అక్కడ మద్యం తాగి.. కొంత ద్విచక్ర వాహనంలో పెట్టుకుని స్వగ్రామానికి ప్రయాణమయ్యారు. మార్గ మధ్యంలో ఆంధ్ర బార్డర్ చీకలబైలు చెక్ పోస్టు వద్ద పోలీసులు తమ వద్ద ఉన్న బాటిల్ తీసుకుంటారనే భయంతో వాహనాన్ని వేగంగా ముందుకుపోనిచ్చారు. ఈ క్రమంలో అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును చూసి సడెన్ బ్రేక్ వేశారు. వాహనం అదుపు తప్పి ఇద్దరూ బస్సు వెనుక చక్రం కింద పడ్డారు. తీవ్ర గాయాలవడంతో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు మదనపల్లె తాలూకా పోలీసులకు తెలపడంతో సీఐ శేఖర్ సిబ్బందితో కలిసి ప్రమాదస్థలానికి వెళ్లాడు. కారణాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతుల బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు-ట్రాక్టర్ ఢీ

సంబేపల్లె : మండలంలోని దేవపట్ల సమీపంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. పోలీసుల వివరాల మేరకు మండలంలోని గోరావాండ్లపల్లెకు చెందిన నాగేశ్వర్ ట్రాక్టర్‌లో దేవపట్లకు వచ్చి తిరిగి వెళ్తున్నారు. రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద మలుపు తిరుగుతుండగా కలకడ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో కారులో ఉన్న ఇర్ఫాన్, టాక్టర్ డ్రైవర్ నాగేశ్‌లకు గాయాలయ్యాయి. 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగే సమయానికి కారులో ఉన్న పలువురు ప్రాణాలతో బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి విచారిస్తున్నారు.

మాకు ఈ ఇసుక వద్దు బాబోయ్



జ్యోతి ఇసుక రీచ్‌లో ఇసుక వద్దని డ్రైవర్లు నిలిపివేసిన వాహనాలు

సిద్ధవటం : ఈ ఇసుక నాణ్యమైనది కాదు.. మాకు వద్ద అంటూ మండలంలోని జ్యోతి గ్రామంలో లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఇసుక ఇస్తామని చెప్పినా కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకురావడం లేదని వారు ఆరోపించారు. దువ్వ ఇసుక కావడంతో లోడింగ్ చేసినా టన్నేజీ తక్కువ వస్తోందని, క్వారీని అధికారులు మరో ప్రాంతానికి బదలాయించాలని వారు అవేదన వ్యక్తం చేశారు. లోడ్‌తో వెళ్లాల్సిన దారి సక్రమంగా లేకపోవడంతో క్వారీలో వాహనాలు నిలిపివేసినట్లు తెలిపారు. లారీ ఇసుక 21 టన్నులుగా లోడ్ చేసినా.. కాటా వేస్తే తక్కువగా చూపుతోందని తెలిపారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వివారణ కోరగా.. రీచ్ ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. జేసీబీ యంత్రాలతో లారీకి 21 బకెట్లు వేస్తున్నామని తెలిపారు. రాత్రి వేళల్లో రవాణా చేయాలని ఇంకా స్పష్టమైన ఆదేశాలు రాలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే ఇసుక పంపుతున్నామన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే చర్యలు



చికెన్ సెంటర్ యజమానికి సలహాలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు

రాయచోటి అర్బన్ : ప్రజారోగ్యంతో చెలగాటమాడే చికెన్ సెంటర్ నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వాసుబాబు హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి పట్టణంలోని ఎస్‌యన్ కాలనీ, బంగ్లా, ఠాణా, సుండుపల్లె రోడ్డు ప్రాంతాల్లోని చికెన్ దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికెన్ విక్రయ దుకాణాల లోపల, బయట అపరిశుభ్రత లేకుండా చూసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించని వారికి భారీగా జరిమానా విధించడంతో పాటు దుకాణాలు సీజ్ చేసేందుకు వెనుకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సీతారామయ్య, శివమల్‌రెడ్డి, నాగార్జున, శివకుమార్, తరుణ్ పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో మోసం చేశారని ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం : బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు నగలను విడిపించిన పాపానికి తాను రూ.24 లక్షలు మోసపోయానని విజయవాడకు చెందిన శివక్రిష్ణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కందుకూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో గొల్లపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు గతంలో 398 గ్రాముల బంగారు నగలు తనఖా పెట్టి ఓ బ్యాంకులో రూ.10 లక్షలకు పైగా రుణం తీసుకున్నారు. అనంతరం ఆ నగలు కొనాలని, బ్యాంకు రుణం, దానికి వడ్డీ కట్టి..మిగిలిన సొమ్మును తమకు నగదుగా ఇవ్వాలని తనఖా పెట్టిన ముగ్గురిలో వేణుగోపాల్ విజయవాడకు చెందిన శివకృష్ణను సంప్రదించారు. అనంతరం మొత్తంగా రూ.24 లక్షల నగదును శివక్రిష్ణ ..వేణుగోపాల్, వారి మిత్రులకు చెల్లించాడు. నగలు తీసుకున్న అనంతరం శివకృష్ణ అప్రైజర్ ద్వారా పరీక్షించగా నకిలీవిగా నిర్ధారణ కావడంతో మోసపోయానని గ్రహించాడు. బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు నగలు నిర్ధారణ చేసేది అప్రైజర్, తనఖా పెట్టిన బంగారు నగలా, గిల్టు నగలా, ఇందులో అప్రైజర్ హస్తం ఏమైనా ఉందా? బాధితుడు కక్ష పూరితంగా ఫిర్యాదు చేశారా? అనే విషయాలపై పోలీసులు విచారించాల్సి ఉంది.